## అయ్యప్ప స్వామి మహాపడిపూజ



శంషాబాద్ రూరల్, డిసెంబర్ 20 : శంషాబాద్ అయ్యప్పస్వామి ఆలయంలో మధు గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం మహాపడిపూజ నిర్వహించారు. పూజలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, కౌన్సిలర్ మేకల వెంకటేశ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

## రేణుక సాగర్‌కు రతన్ టాటా అవార్డు

కాచిగూడ, డిసెంబర్ 20 : నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి మహిళ కళాశాలలో 26 ఏండ్లుగా బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో సేవలందిస్తున్న విద్యావేత్త, ప్రొఫెసర్ బి.రేణుకసాగర్‌ను రతన్ టాటా ఎక్స్‌లెన్సీ అవార్డు-2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు.

## జాబ్ మేళాకు స్పందన



హిమాయత్‌నగర్, డిసెంబర్ 20: విద్యార్థులు పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకుంటారని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ జోసెఫిన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు నియామకపు పత్రాలను అందజేశారు. కళాశాల డైరెక్టర్లు శశికిరణ్‌రెడ్డి, నీతారెడ్డి, అధ్యాపకులు మధుసూధన్‌రెడ్డి, బి.సంతోష్ రెడ్డి, మేఘ,రాగిణి, అరవింద్, జాఫర్, మహేశ్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

# అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ కేవీపీఎస్, సీఐటీయూ ఆందోళన

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 20: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాటేదాన్ చౌరస్తా వద్ద ప్లకార్డులు, జెండాలు చేతబట్టి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అమిత్‌షా అహంకారపూరితమైన, తిరస్కార స్వరంతో మాట్లాడుతున్నారన్నారు. ఈ వాఖ్యలకు బాధ్యత వహిస్తూ అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా క్షమాపణలు చెప్పే వరకు అన్ని సామాజిక, ప్రజాసంఘాలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు జి.ఎం.కురుమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సీఐటీయూ నాయకులు స్వామి, వెంకటయ్య, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.



కాటేదాన్ చౌరస్తాలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం దగ్ధం చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు



బండ్లగూడ : ఆరె మైసమ్మ దేవాలయం వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

### అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

బండ్లగూడ : ఢిల్లీలో పార్లమెంట్ సాక్షిగా హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడడం దేశ ప్రజలందరినీ బాధించిందని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని సీఐటీయూ నాయకులు రుద్రకుమార్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరెమైసమ్మ దేవాలయం వద్ద వారు సీపీఎం నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలందరికీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఉపయుక్తంగా ఉందన్నారు. అంబేద్కర్ వంటి మహనీయుడిని అవమానించిన అమిత్‌షా వెంటనే ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సీఐటీయూ, సీపీఎం నాయకులు స్వామి, యాదగిరి, సుభాష్, నరసింహ, రాము, మల్లయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యాన్ని నివారించేందుకే ఈవీ పాలసీ

- త్వరలో ఆర్టీసీ బస్సులను సైతం విద్యుదీకరిస్తాం..
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో మొక్కలు నాటుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, డిసెంబర్ 20: హైదరాబాద్‌లో కాలుష్యాన్ని నివారించేందుకు ఈవీ పాలసీ తీసుకువచ్చామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే అన్ని ఆర్టీసీ బస్సులను, ఇతర వాహనాలను విద్యుదీకరణ చేస్తామన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నంబర్-12 లోని కమాండ్ కంట్రోల్ సమీపంలోని లింక్ రోడ్డు ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశ రాజధాని ఢిల్లీలో విపరీతంగా పెరిగిన కాలుష్యం కారణంగా స్కూళ్లను మూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. దాంతో అక్కడి ప్రజలు వేరేప్రాంతానికి వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌లో రాకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి పౌరుడు మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ఈవీ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. 15 సంవత్సరాల కాల పరిమితి పూర్తిచేసుకున్న వాహనాలను స్క్రాప్‌గా మార్చి ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకువచ్చేలా పాలసీ తెచ్చామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

### జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు

## ఉద్యోగ భద్రత కల్పించాలి





యూనియన్ మహాసభలో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్,డిసెంబర్20: జీహెచ్‌ఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ మూడో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో సుమారు 30 వేలకుపైగా కార్మికులు పని చేస్తూ జీహెచ్‌ఎంసీకి ఆదాయం సమకూర్చుతున్నా వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదన్నారు. కరోనా లాంటి పరిస్థితుల్లో పేదలకు కార్మికులు ఎన్నో సేవలందించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచందర్, ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు కిషన్, నరసయ్య, నిరంజన్, స్వప్న, కొండల్, విక్రమ్ పాల్గొన్నారు.

## విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాష ల్లో జూనియర్ డిప్లొమా, సీనియర్ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## బ్లాస్టింగ్‌కు పాల్పడిన వారిపై కేసు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మణికొండ,డిసెంబర్ 20 : అనుమతులు తీసుకోకుండా బ్లాస్టింగులు చేపట్టిన వ్యక్తులపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. 'బ్లాస్టింగులతో దద్దరిల్లిన కోకాపేట' పేరుతో శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశమైయింది. వార్త కథనంపై స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట నియోపోలీస్ లే అవుట్‌లో కొన్ని సంస్థలు చేపడుతున్న నిర్మాణాల్లో గుట్టలను తొలగించే క్రమంలో అనుమతులు లేకుండా భారీ ఎత్తున బ్లాస్టింగులు చేస్తున్నారు. గురువారం పట్టపగలు బ్లాస్టింగ్ చేయడంతో వాహనాలు, గుడిసెలు, శివాలయ సన్నిధానంలో ఉన్న అయ్యప్ప స్వాములపైకి రాళ్ల చువ్వలు ఎగిరిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఓ ఆటో, ఇటాచీ వాహనం, రేకుల షెడ్డు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదాలపై 'బ్లాస్టింగులతో దద్దరిల్లిన కోకాపేట' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో ఓ కథనం ప్రచురితమైంది. స్పందించిన నార్సింగి పోలీసులు శుక్రవారం చర్యలకు శ్రీకారం చుట్టారు. బ్లాస్టింగులకు పాల్పడిన వ్యక్తులపై ఎక్స్‌ప్లోసివ్ యాక్టుతో పాటు బీఎన్ఎస్ 125, 91బీ ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





## మహవీర్ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కళాశాల జాయింట్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 20: విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం హర్షణీయమని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి అన్నారు. ఉస్మానియా ఆసుపత్రి సహకారంతో శుక్రవారం మహవీర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు 150 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్‌రెడబ్డి మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. యువత ప్రతి 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.ఉస్మానియా వైద్య బృందం డాక్టర్ యూ.శ్రీలత, డాక్టర్ సాయి సుధ, డాక్టర్ ప్రణీత, డాక్టర్ శ్రావ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వీరేంద్రపాటిల్, డాక్టర్ మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 22న నగరానికి చేరుకోనున్న

## గోమాత, భూమాత పరిరక్షణ పాదయాత్ర



ఖైరతాబాద్, డిసెంబర్ 20 : గోమాత, భూమాత, పర్యావరణ పరిరక్షణకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు(మొత్తం14 రాష్ట్రాలు, 180 రోజులు, 4,900 కిలోమీటర్లు) చేయనున్న గో మహాపాదయాత్ర ఈ నెల 22న హైదరాబాద్‌కు చేరుకోనుందని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రతినిధులు శివపార్వతి మాత, సుధాకర్‌శర్మ, కృష్ణమాతతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం శ్రీనాథ్ మాట్లాడుతూ.. పవిత్ర పాదయాత్ర 87 రోజులుగా 9 రాష్ట్రాలు దాటి 2,700 కిలోమీటర్లు పూర్తి చేసుకొని హైదరాబాద్‌కు వస్తున్నదన్నారు. 22న బషీర్‌బాగ్ అమ్మవారి దేవాలయంలో సప్త గోవులకు ఇరుముడి ధరింపజేసి ఉదయం 8 గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభవుతుందన్నారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం వద్ద గో మహా హారతి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6గంటలకు గడ్డి అన్నారం హనుమాన్ దేవాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హైకోర్టు రిటైర్ట్ జడ్జి జస్టిస్ డాక్టర్ శివశంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్, శివస్వామిజీ, మాతా నిర్మలానంద యోగాభారతి హాజరవుతారని పేర్కొన్నారు.

## విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ





రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేసిన హోలీ క్రాస్ సంస్థ ప్రతినిధులు

బండ్లగూడ, డిసెంబర్ 20 : టీవీలు, సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్ల వినియోగాన్ని తగ్గించుకుంటే కంటి సమస్యల బారినపడకుండా ఉండొచ్చని హోళీ క్రాస్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు మాడుగుల ఉదయ్ కుమార్ అన్నారు. గత నెల 20న రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హోళి క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించమన్నారు. శుక్రవారం అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

భవిష్యత్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మరిన్ని సేవలందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సీతారామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసులో ఇద్దరికి జీవితఖైదు, జరిమానా

బండ్లగూడ,డిసెంబర్ 20 : మైనర్ బాలికను అపహరించి రేప్, హత్యాయత్నం చేసిన కేసులో కోర్టు నిందితులకు జీవితఖైదుతో పాటు జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి.. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరంఘర్ ప్రాంతంలో 2020లో ఓ మైనర్ బాలికను ఇద్దరు అపహరించి అత్యాచారం చేసి చంపాలని ప్రయత్నించారు. పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులైన షేక్ జాఫర్, షేక్ నయీమ్‌లకు న్యాయమూర్తులు జీవితఖైదు, ఒక్కొక్కరికి రూ. 16 వేల చొప్పున జరిమానా విధించినట్లు పోలీసుల తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన ధన్‌రాజ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 20 : వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన జి ధన్‌రాజ్(40) వంట మాస్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18న కాచారం గ్రామంలోని బంధువు నారాయణ పొలం వద్దకు వెళ్లాడు. అట్నుంచి తిరిగి మల్కారం గ్రామానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లలేదు. దాంతో ఆందోళన చెందిన అతడి కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 20 : బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ఘటన శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన భానుతేజరెడ్డి, వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్ ఇద్దరు గచ్చిబౌలిలో నివాసముంటున్నారు. వారు బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయి తరలిస్తుండగా పోలీసులు తొండుపల్లి టోల్‌గేట్ వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. కారులోని 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి



కాటేదాన్‌లో ఆశా రాష్ట్ర బస్‌జాత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి జిల్లా ఆశావర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 20: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రంగారెడ్డి జిల్లా ఆశా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు జి.కవిత డిమాండ్ చేశారు. ఆశ రాష్ట్ర బస్‌జాత ఈ నెల 30న రంగారెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్‌తో కలిసి కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలంతా బస్‌జాతను జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశావర్కర్లకు 18వేల రూపాయల వేతనం ఇస్తామని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత, ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తామని వాగ్దానాలు ఇచ్చిందన్నారు. సంవత్సరం అవుతున్నా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా తీర్చలేదన్నారు. రాష్ట్రంలోని ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని బస్సు జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నిర్మల, భాగ్య, శోభ, నవనీత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయండి..



డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

బండ్లగూడ, డిసెంబర్ 2 : తమ ఉద్యోగాలను ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని శుక్రవారం ఏఎన్‌ఎంలు రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏఎన్‌ఎంల ఉద్యోగాలకు కొత్తగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించి ఉద్యోగాలు ఇస్తాననడం సమజసం కాదన్నారు. తాము 20 ఏళ్ల క్రితమే డీఎస్సీ పరీక్షలు రాసి ఏఎన్‌ఎంలకు ఉద్యోగాలు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. నాటి నుంచి తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయకుండా ప్రభుత్వాలు కాలయపన చేయడం తగదన్నారు. తమను ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా డీఎస్సీ పరీక్షలు రాయమనడం బాధాకరమన్నారు. వెంటనే ఈనెల 29న నిర్వహించే డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి ప్రస్తుతం ఉన్న ఎఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హసీన, అమృత, అరుణ, సునీత, శోభ, ఆండాలు, యాదమ్మ, కౌసర్, జయ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### మాజీ భార్య, ఆమె భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి

# నలుగురి మరణానికి కారణమైన వ్యక్తికి మరణ శిక్ష

- సహకరించిన మరో వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధించిన నాంపల్లి క్రిమినల్ కోర్టు

హిమాయత్‌నగర్, డిసెంబర్ 20: తనను కాదని మరో వ్యక్తిని వివాహం చేసుకుందనే అక్కసుతో తన మాజీ భార్య, ఆమె భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి నలుగురి మరణానికి కారణమైన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి నాంపల్లి క్రిమినల్ కోర్టు శుక్రవారం మరణ శిక్ష విధించింది. అతడికి సహకరించిన మరో వ్యక్తికి వెయ్యి రూపాయల జరిమానా, యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన నాగుల సాయి(37) చిక్కడపల్లిలోని మున్సిపల్ మార్కెట్ సమీపంలో నివాసం ఉండే ఆర్తీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. నారాయణగూడ ప్లైఓవర్ సమీపంలో వారు పూలు అమ్మి జీవనం సాగించేవారు. వారికి మూడేళ్ల కుమార్తె ఉన్నది. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దాంతో ఆర్తీ తన తల్లి లక్ష్మీబాయి, సోదరుడు జితేందర్‌తో కలిసి నివాసం ఉంటున్నది. ఈ క్రమంలోనే ఆర్తీకి చిక్కడపల్లిలో ఉండే నాగరాజుతో పరిచయం ఏర్పడి అతడిని పెండ్లి చేసుకుంది. దాంతో ఆమెపై కోపం పెంచుకున్న మొదటి భర్త సాయి ఆమెను, ఆమె భర్త నాగరాజును చంపేందుకు కుట్ర పన్నాడు. 2022 నవంబర్ 7న నారాయణగూడ చౌరస్తాలో వారిద్దరూ ఉన్నట్లు తెలుసుకుని జగ్గులో పెట్రోల్‌తో వెళ్లి ఆర్తీ, నాగరాజుపై చల్లి నిప్పటించాడు. దాంతో ఆర్తీ ఒడిలో ఉన్న పది నెలల బాబుకు సైతం మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడటంతో పోలీసులు వారిని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ముగ్గురితోపాటు ఆర్తీ కడుపులో పెరుగుతున్న మగ శిశువు సైతం చనిపోయాడు. అప్పట్లో ఈ సంఘటన సంచలనంగా మారింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తును పూర్తి చేసి చార్జిషీట్ ఫైల్‌చేశారు. మొదటి ప్రాధాన్యత కేసుగా తీసుకున్న నాంపల్లి క్రిమినల్ కోర్టు జడ్జి వినోద్ కుమార్ శుక్రవారం నాగుల సాయిని దోషిగా తేల్చి మరణశిక్ష విధించగా సహకరించిన రాహుల్‌కు రూ. 1000 జరిమానా, యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## శంషాబాద్ విద్యుత్ కార్మిక యూనియన్ అధ్యక్షుడిగా భాస్కర్



శంషాబాద్ రూరల్, డిసెంబర్ 20 : శంషాబాద్ విద్యుత్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా చిన్నగండు భాస్కర్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలో ఎలక్ట్రిషన్ కార్మిక యూనియన్ సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా చిన్నగండు భాస్కర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ఎలక్ట్రిషియన్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నాయకుడు అంజయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, శంషాబాద్ కార్మికులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



బాల్‌రెడ్డినగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

బంజారాహిల్స్,డిసెంబర్ 20: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో రూ. 35 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పరిశీలించారు. బస్తీవాసులకు ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని, బాల్‌రెడ్డినగర్ కట్ట మైసమ్మ ఆలయానికి వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



బండ్లగూడ,డిసెంబర్ 20 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ ప్రాంతానికి చెందిన రుద్రాక్ష పుల్లమ్మ తన భర్త జ్ఞాపకార్థం శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇరవై మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. స్థానిక కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 20: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్ కాలనీ ప్రాంతంలోని సెప్టిక్ ట్యాంక్‌పైన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారన్నారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 30 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించామన్నారు. స్థానికంగా వాకాబు చేయగా మృతుడు భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసిందని పోలీసులు వెల్లడించారు. చలి తీవ్రత, అనారోగ్య సమస్యలతో చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.